సాక్షిపై వేధింపులు దారుణం

- సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డికి పోలీసులు బెదిరింపుపై విలేకరుల నిరసన
- కొత్తపేట, పి.గన్నవరం నియోజకవర్గాల్లో ఆందోళనలు
- ఆర్డీఓ శ్రీకర్‌కు, డీఎస్పీ మురళీమోహన్‌కు వినతిపత్రాలు


మామిడికుదురులో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న విలేకరులు


కొత్తపేటలో ఆర్డీఓ శ్రీకర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న విలేకరులు

కొత్తపేట: సాక్షి దినపత్రికపై, ఆ పత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డిపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు చేపట్టడం దారుణమని కొత్తపేట నియోజక వర్గ విలేకరులు ఆందోళన వ్యక్తం చేశారు. వరుసగా ఐదు రోజులు సాక్షి కార్యాలయాల్లో పోలీసులు దౌర్జన్యంగా ప్రవేశించి హల్‌చల్ చేయడంతోపాటు ఎడిటర్‌ను ప్రశ్నలపై ప్రశ్నలు వేసి, నోటీసులు ఇచ్చి బెదిరించడం, వేధింపులకు గురి చేయడం, నెల్లూరు సాక్షి బ్యూరో ఇన్‌చార్జి మస్తాన్‌రెడ్డికి నోటీసులు ఇవ్వడం ప్రభుత్వ నియంతృత్వ విధానాలకు అద్దం పడుతోందని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం తరపున పోలీసుల చర్యలకు నిరసనగా శుక్రవారం డివిజన్ కేంద్రం కొత్తపేటలో ఆర్డీఓ పీ శ్రీకర్‌కు వినతిపత్రం సమర్పించారు. అలాగే డీఎస్పీ సుంకర మురళీమోహన్ తరపున ఎస్సై జీ సురేంద్ర వినతిపత్రాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు విలేకరులు మాట్లాడుతూ సాక్షిపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం అప్రజాస్వామికమన్నారు. నకిలీ మద్యం దందాపై వాస్తవాలను వెలుగులోకి తీసుకు వస్తుండడం, మద్యం అక్రమాలపై వార్తా కథనాలను ప్రసారం చేస్తుండడంతో సాక్షి గొంతునొక్కే ప్రయత్నంలో భాగంగా ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాస్తున్నారన్న కారణంతో టార్గెట్ చేసి ఇబ్బంది పెడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ విలేకరులు జగతా రాంబాబు, అడపా ప్రసాద్, కొవ్వూరి ఆదినారాయణరెడ్డి, బొరుసు సాయి రంగనాథబాబు, బొరుసు జానకిరామయ్య, రాయుడు జైదేవ్, శ్రీఘాకోళ్లపు బాబి పాల్గొన్నారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: 'సాక్షి' మీడియాపై వేధింపులను నిరసిస్తూ శుక్రవారం జర్నలిస్టులు ఆందోళన నిర్వహించారు. పి.గన్నవరం నియోజకవర్గం జర్నలిస్టులు మామిడికుదురు తహసీల్దార్ పి.సునీల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి 'సాక్షి'పై వేధింపులు ఎక్కువయ్యాయని ఏపీయూడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కోశాధికారి మట్టపర్తి శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డితో పాటు పలువురు సాక్షి జర్నలిస్టులపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు చేపడుతుందన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేసేలా కూటమి వ్యవహరిస్తోందన్నారు. కక్ష సాధింపు చర్యలను మానుకోవాలని హితవు పలికారు. లేని పక్షంలో ప్రభుత్వంపై పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామన్నారు. ఈ నిరసనలో మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎస్ఎస్‌డీ ప్రసాద్, జర్నలిస్టులు అమీర్ హసన్, బొమ్మిడి హరిబాబు, గుబ్బల హరిబాబు, తోరం సత్యనారాయణ, బోయి రాంబాబు, యేడిద వెంకటేశ్వరరావు, టీకే దుర్గాశంకర్, బావిశెట్టి నాగేశ్వరరావు, యేడిద బాలకృష్ణ పాల్గొన్నారు.



తహసీల్దారుకు వినతిపత్రం

రాజోలు: సాక్షి కార్యాలయాలపై దౌర్జన్యాన్ని నిరసిస్తూ విలేకరులు శుక్రవారం రాజోలు తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు భాస్కరరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంబత్తుల సురేంద్రకుమార్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు, స్కామ్‌లు వెలికితీసే జర్నలిస్టులను వేధింపులకు గురి చేయడం సబబు కాదన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి దాడులు జరగకుండా చూడాలని, జర్నలిస్టులకు రక్షణ చట్టాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఏపీడబ్ల్యూజే కార్యవర్గ జిల్లా సభ్యుడు చింతా మధుకుమార్, వి.వి.నాగేశ్వరరావు, రాజోలు నియోజకవర్గ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు పాల్గొన్నారు.


రాజోలు తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న విలేకరులు

క్లుప్తంగా

ఆపదలో ఆదుకున్న స్నేహితులు


గొందిలో బాధితుడు చిట్టిబాబుకు సాయం చేస్తున్న విజయ్ ప్రసా

సఖినేటిపల్లి: గొంది గ్రామానికి చెందిన దొండపాటి చిట్టిబాబుకు శుక్రవారం తోటి స్నేహితులు రూ.55 వేలు ఆర్థిక సాయం చేశారు. ఇటీవల చిట్టిబాబు ప్రమాదవశాత్తూ బిల్డింగ్‌పై నుంచి జారి పడిపోయాడు. ప్రమాదంలో వెన్నుముక, కాలు విరిగి రాజమహేంద్రవరంలో చికిత్స పొందాడు. చిట్టిబాబు ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న 2002–2003 బ్యాచ్ సఖినేటిపల్లి లూథరన్ ఉన్నత పాఠశాల తోటి విద్యార్థులపై మొత్తాన్ని సమకూర్చారు. దీనిని సామాజికవేత్త సరెళ్ల విజయ్ ప్రసాద్ చేతుల మీదుగా బాధితుడు చిట్టిబాబుకు ఇచ్చారు. చెవ్వాకుల రమేష్, జిల్లెళ్ళ రాజేష్, కొండేటి బాల, గొల్ల రాజీవ్, గెడ్డం మోహన్ పాల్గొన్నారు.

హైస్కూల్‌కు జిరాక్స్ మెషీన్ బహూకరణ


ప్రింటర్, జిరాక్స్ మెషీన్ అందిస్తున్న పూర్వ విద్యార్థులు

మామిడికుదురు: పాశర్లపూడిలంక జెడ్పీ హైస్కూల్‌కు 1995–96 పదో తరగతి పూర్వ విద్యార్థులు శుక్రవారం రూ.22 వేలు విలువ చేసే ప్రింటర్ కమ్ జిరాక్స్ మెషీన్ బహుకరించారు. మ్యాథ్స్ టీచర్ కె.సుబ్బలక్ష్మి ప్రోత్సాహంతో దీనిని స్కూల్‌కు అందజేశారు. విద్యార్థులకు ఉపయోగపడేలా సామాజిక బాధ్యతతో ఈ కార్యక్రమం చేపట్టారు. దీన్ని స్కూల్ ఉపాధ్యాయులకు అందజేశారు. పూర్వ విద్యార్థులను స్థానికులు, ఉపాధ్యాయులు అభినందించారు.

తహసీల్దార్ రాజేశ్వరరావుకు డీసీగా పదోన్నతి


రాజేశ్వరరావును అభినందిస్తున్న అధికారులు


కొత్తపేట: ఆత్రేయపురం తహసీల్దార్‌గా పనిచేస్తున్న టీ రాజేశ్వరరావు డిప్యూటీ కలెక్టర్ (డీసీ)గా పదోన్నతి పొందారు. రాష్ట్ర వ్యాప్తంగా 37 మంది తహసీల్దార్లకు డీసీలుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసినట్టు జిల్లా నుంచి రాజేశ్వరరావు ఆ జాబితాలో ఉన్నారని కార్యాలయం సిబ్బంది తెలిపారు. ఆయనకు పోస్టింగ్ కేటాయించాల్సి ఉందని తెలిపారు. ఈసందర్భంగా రాజేశ్వరరావును శుక్రవారం సాయంత్రం కార్యాలయం అధికారులు, సిబ్బంది అభినందనలు తెలియజేశారు. ఇన్నాళ్లు మండలంలో రెవెన్యూ సేవలకు సంబంధించి అన్ని విధాలుగా తనకు సహకరించిన ఉన్నతాధికారులు, స్థానిక అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఆర్‌డీ రామచంద్రమూర్తి, ఎంఆర్‌ఐ యం భాను, కార్యాలయం సిబ్బంది, వీఆర్‌ఓలు, చౌకడిపో డీలర్లు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.10వేల విరాళం


దాత బాబాయ్, శ్యామల దంపతులకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ప్రధాన అర్చకుడు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి వారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి ముమ్మిడివరం మండలం కొత్తలంకకు చెందిన కాశి బాబాయ్, శ్యామల దంపతులు శుక్రవారం రూ.10 వేల విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని వినాయకరావుకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

'ఇందుకూరి'కి సతీ వియోగం


నాగమణి (ఫైల్)

పి.గన్నవరం: రాజులపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు, కోనసీమ క్షత్రియ సేవా సంఘం కోఆర్డినేటర్ ఇందుకూరి నర్సింహరాజు భార్య నాగమణి(47) గురువారం రాత్రి హైదరాబాద్‌లో మృతి చెందారు. ఆమె గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వీరికి ఒక కుమారుడు ఉన్నారు. నాగమణి మృతిపై పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, సర్పంచ్ కొంబత్తుల ఏసుబాబు, మండల శాఖ అధ్యక్షుడు యన్నాబత్తుల ఆనంద్, పేరిచర్ల నాగరాజు, గ్రామస్తులు, పలువురు నాయకులు, కార్యకర్తలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఫోన్‌లో నర్సింహరాజును పలువురు ఎరామర్శించారు.

జాగ్రత్తలు తీసుకుంటే నొప్పులు మాయం

- ఫిజియోథెరపిస్టులు మోహిత్, సీత
- ర్యాలిలో ఉచిత ఫిజియోథెరపీ శిబిరం


ర్యాలిలో ఫిజియోథెరపీ వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ మోహిత్, సీత

కొత్తపేట: జాగ్రత్తలు తీసుకుంటూ, వ్యాయామం చేయడం ద్వారా భుజం, మోకాళ్లు, నడుము నొప్పులు నుంచి విముక్తి పొందవచ్చని ప్రముఖ ఫిజియోథెరపిస్టు వైద్యులు డాక్టర్ చింతా మోహిత్, డాక్టర్ సీత తెలిపారు.ర్యాలి గ్రామంలో అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నపూర్ణ డే కేర్ హోంలో శ్యామ్ అడ్వాన్స్ ఫిజియోథెరపీ అండ్ రీహాబిలిటేషన్ సెంటర్ అధినేత డాక్టర్ మోహిత్, సీత ఉచిత ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని రాష్ట్ర భారతీయ కిసాన్ సంఘ్ కన్వీనర్ డాక్టర్ ఉప్పుగంటి భాస్కరరావు ప్రారంభించారు. శిబిరంలో అవసరమైన 10 మందికి ఫిజియోథెరపీ మెటీరియల్ అందజేశారు. నొప్పులతో బాధపడుతున్న సుమారు 60 మంది శిబిరాన్ని వినియోగించుకున్నారు. శిబిరానికి వచ్చిన వారందరికీ శ్యామ్ జాదూగర్ మ్యాజిక్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం ప్రోత్సాహకులు వందనా దేవి, సీతారత్నం, తేజశ్రీ అన్నపూర్ణ, శ్రీధర్, కుమారలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనకు చరమగీతం

- కలసికట్టుగా మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిలిపివేయాలి
- కోటి సంతకాల ఉద్యమంలో మాజీ మంత్రి గొల్లపల్లి


ములికిపల్లిలో కోటి సంతకాల ఉద్యమం నిర్వహిస్తున్న గొల్లపల్లి

రాజోలు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 'కోటి సంతకాల ఉద్యమ రచ్చబండ' కార్యక్రమంతో కూటమి ప్రభుత్వానికి చరమగీతం పాడాలని మాజీ మంత్రి, రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. శుక్రవారం మండలంలోని చింతలపల్లి, ములికిపల్లి, కూనవరం గ్రామాల్లో కోటి సంతకాల ఉద్యమ రచ్చబండ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. చింతలపల్లిలో గ్రామశాఖ అధ్యక్షుడు నల్లి నాగబాబు, ములికిపల్లి గ్రామంలో దొమ్మేటి సత్యప్రసాద్, కూనవరంలో కలిగితి వెంకటేశ్వరరావుల ఆధ్వర్యాన కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక పాలనపై గొల్లపల్లి వివరించి సంతకాలు సేకరించారు. చింతలపల్లిలో డాక్టర బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గొల్లపల్లి మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ప్రతి ఒక్కరూ కలసికట్టుగా నిలుపుదల చేయాలన్నారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ జరిగితే మెరిట్ విద్యార్థులతోపాటు, బడుగు, బలహీన వర్గాలకు ఎంతో నష్టం జరుగుతుందన్నారు. జెడ్పీటీసీ మట్టా శైలజ, మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ గుబ్బల రోజారమణి, రాష్ట్ర నాయకులు పాటి శివకుమార్, కటకంశెట్టి ఆదిత్య, తాడి సహదేవ్, ఉచ్చుల విష్ణు, గుర్రం జాషువా, కోటిపల్లి ఏస్తేరురాణి, గుబ్బల మనోహర్, మట్టా సురేష్, మాజీ సర్పంచ్‌లు తులా సత్యనారాయణ, గెడ్డం సత్యనారాయణ, తాడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లల్లో నీటిని నిల్వ ఉంచొద్దు


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్య నెలకొల్పేందు ప్రతి శుక్రవారాన్ని పొడి వారం (డ్రైడే) నిర్వహించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.శిరీష, వంశీ కోరారు. ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. రుబ్బు రోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. దీనివల్ల క్రిమి, కీటకాలు దరి చేరవని, తద్వారా అంటు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది ఫ్రై డేను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. సీహెచ్ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, ఆర్.బాలమణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన


పి.గన్నవరం హైస్కూలులో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పి.గన్నవరం: చట్టాలపై అవగాహన పెంపొందించుకొని ప్రజలంతా జాగృతం కావాలని పి.గన్నవరం ఎస్సై బి.శివకృష్ణ పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ ఇటీవల ప్రారంభించిన జన జాగృతి రథం ద్వారా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఆయన చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రజల్లో మాదకద్రవ్యాల వాడకాన్ని నియంత్రించడం, సైబర్ నేరాలపై జాగ్రత్తలు, మహిళలపై గౌరవంగా నడుచుకోవడం వంటి అంశాలపై ఈరథం ద్వారా అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి చట్ట విరుద్ధమైన పనులకు దూరంగా ఉండాలని శివకృష్ణ సూచించారు. ఏఎస్సై ఎస్.పట్టాభిరామయ్య, స్టేషన్ సిబ్బంది, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ గ్రిడ్ ట్రంక్ పైపులైన్ల పనులకు భూమిపూజ

పి.గన్నవరం: ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. ఉమ్మడి జిల్లాలో రూ.1650 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న వాటర్ గ్రిడ్ పథకంలో భాగంగా నియోజకవర్గంలో ట్రంక్ పైపులైన్ల పనులకు శుక్రవారం నాగుల్లంక గ్రామంలో ఆయన భూమిపూజ చేశారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఎంపీడీఓ జి.మల్లికార్జునరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రవీంద్రబాబు, జేఈ జె.కళ్యాణ్ చక్రవర్తి, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

జనార్దన స్వామికి నేడు గరుడసేవ


ఆలమూరు: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత జనార్దన స్వామి ఆలయంలో ధన త్రయోదశి పర్వదినాన్ని పురస్కరించుకుని గరుడ సేవను నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు, ఈఓ బి.నరేంద్రకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం వారు మాట్లాడుతూ దాస్య భక్తికి ప్రతీక అయిన గరుడాళ్వార్‌ను అధిరోహించిన స్వామిని సేవించడానికి ఈ గరుడసేవను నిర్వహించనున్నామన్నారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సేవను తిలకించాలని కోరారు.


క్రీడలతో మానసికోల్లాసం

అంబాజీపేట: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోను పాల్గొనాలని, క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని హెచ్ఎం కడలి సాయిరామ్ అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యక్రమం ఎంఈఓలు కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ క్రీడాకారుడు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు.

ఎస్‌సీఎఫ్ మండల కో ఆర్డినేటర్ కుంపట్ల ఆదిలక్ష్మి పర్యవేక్షణలో మండలంలోని 9 జెడ్పీ హైస్కూల్, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు పీడీలు, పీఈటీలు అండర్–14, 17 విభాగాల్లో బాలికలకు వాలీబాల్, కబడ్డీ, కోకో, బ్యాడ్మింటన్, యోగా పోటీలను నిర్వహించారు. ఈ పోటీలో సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

న్యాయమూర్తిపై దాడిని నిరసిస్తూ మానవహారం


అంబాజీపేటలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు


పి.గన్నవరంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మామిడికుదురు: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయిపై జరిగిన దాడిని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం మామిడికుదురులో మానవహారం నిర్వహించారు. మండల రెవెన్యూ కార్యాలయం ఎదురుగా 216వ నంబర్ జాతీయ రహదారిపై ధర్నా చేశారు. దాడికి పాల్పడిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన ప్రదర్శన నిర్వహించారు. తహసీల్దార్ పి.సునీల్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ నిరసలో మండల యువసేన అధ్యక్షుడు యార్లగడ్డ రవి, ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి నూటికుర్తి సత్యనారాయణ, ఎమ్మార్పీఎస్ నేతలు తొత్తరమూడి శ్రీనివాస్, సిర్రా శ్రీనివాస్, చేట్ల సత్యనారాయణ, చుట్టుగుళ్ల దొరబాబు, బుజ్జిబాబు, ఈతకోట త్రిమూర్తులు పాల్గొన్నారు.

అంబాజీపేట: జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిలో వారిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ మండల ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్.వెంకటేశ్వరరావుకు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఉందుర్తి నాగబాబు, నవుండ్రు వెంకటరమణ, ఈతకోట నాగరాజు, ఈతకోట సురేష్, వీరాస్వామి, చిట్టిబాబు నాయకులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసి, తక్షణమే అరెస్టు చేయాలని పి.గన్నవరం మండల ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కాప ఎస్‌వీ గోపాలకృష్ణ (నాని) ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లవరపు రవికుమార్, గౌరవాధ్యక్షుడు తవిటికి వీరాభిమన్యుడు, జిల్లా నాయకులు ఆకుమర్తి ఆశీర్వాదం, కాప బాబూరావు, ములగలేటి నాగరాజు, ఆకుమర్తి జాన్ తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లి: స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయిపై దాడికి శుక్రవారం ఎంఆర్‌పీఎస్ నాయకులు నిరసన తెలిపారు. గవాయి పై దాడి చేసిన వ్యక్తి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు.

ఆలమూరు: న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దౌర్జన్యం చేసిన నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ డిమాండ్ చేసింది. ఆలమూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్ము నారాయుడు ఆధ్వర్యంలో ఎంఆర్‌పీఎస్ కార్యకర్తలు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడి అనారికమని, ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వ్యాఖ్యానించారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వైద్యుడిపై విచారణను ఆపాలి

ఎమ్మెల్యేకి వినతిపత్రం అందించిన సీహెచ్‌సీ సిబ్బంది

పి.గన్నవరం: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆర్థోపెడిక్ వైద్యుడిగా ఉత్తమ సేవలు అందిస్తున్న సూపరింటెండెంట్ యు.రాఘవేంద్రరావుపై మత్తు డాక్టర్ ఉద్దేశపూర్వకంగా ఇచ్చిన ఫిర్యాదుపై విచారణను నిలిపివేయాలని కోరుతూ డాక్టర్ కోటేశ్వరరావుతో పాటు, ఆస్పత్రి సిబ్బంది శుక్రవారం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. సీహెచ్‌సీలో మత్తు డాక్టర్ అందుబాటులో ఉండడం లేదంటూ పలువురు ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో, గత నెల 12వ తేదీన మత్తు డాక్టర్‌పై విచారణ నిర్వహించిన విషయం విదితమే. దానికి సంబంధించిన నివేదిక ఇంకా రాలేదన్నారు. ఈ నేపథ్యంలో సూపరింటెండెంట్‌పై కక్ష పూరితంగా ఫిర్యాదు చేశారన్నారు. దీంతో ఆయనపై విచారణకు విజిలెన్స్ అధికారులు ఆదేశించారన్నారు. సూపరింటెండెంట్‌పై చేపట్టనున్న విచారణ ఆస్పత్రి గౌరవానికి భంగం కలిగించేలా ఉందని, దీనిని నిలిపివేయాలని ఆస్పత్రి సిబ్బంది ఎమ్మెల్యేని కోరారు. దీనిపై ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే చెప్పారు.

గ్రామాల్లో నేడు రచ్చబండ

మామిడికుదురు: ప్రభుత్వ మెడికల్ కలాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా శనివారం మామిడికుదురు మండల పరిధిలోని రెండు గ్రామాల్లో రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము శుక్రవారం తెలిపారు. ఉదయం 8 గంటలకు పాశర్లపూడిలంక, మధ్యాహ్నం రెండు గంటలకు లూటుకుర్రు గ్రామంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. పి.గన్నవరం నియోజకవర్గం కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావుతో పాటు పార్టీ ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

మామిడికుదురు: స్థానిక సబ్ స్టేషన్‌లో బే ఎక్స్‌టెన్షన్ పనులు, ఆర్‌డీఎస్ఎస్ పనుల నిర్వహణ కారణంగా నగరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుందని అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రాంబాబు శుక్రవారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నగరం, మామిడికుదురు, పాశర్లపూడి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక, అప్పనపల్లి, పెదపట్నం, మొగలికుదురు, రాజోలు మండలం తాటిపాక గ్రామాలకు సరఫరాను నిలిపివేస్తున్నామని తెలిపారు.

కొత్తపేట: స్థానిక గ్రామ పంచాయతీ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆ శాఖ అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కే రాంబాబు తెలిపారు. స్థానిక 33/11 కేవీ లైన్ పరిధిలోని 11 కేవీ సమితి రోడ్డు, 11 కేవీ బోడిపాలెం ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మలు తొలగింపు (ట్రీ కటింగ్), మరమ్మతు పనుల నిమిత్తం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

రావులపాలెం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. మండలంలోని కొమరాజులంక, దేవరపల్లి, కేతరాజుపల్లి, గ్రామాలకు, రావులపాలెం గ్రామంలోని పలు ప్రాంతాలకు, ఈతకోటలోని పరిశ్రమలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఉపాధిలో పని దినాలు కల్పిస్తాం

సాక్షి ఎఫెక్ట్

మలికిపురం: రాజోలు దీవిలో పనులు లేకుండా ఖాళీగా ఉన్న కార్మికులకు ఉపాధి పని దినాలు కల్పిస్తామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. పనులు ఉన్నా.. ఉపాధి సున్నా శీర్షికతో బుధవారం సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందిస్తూ ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాజోలు దీవిలో పది వేల 757 మంది ఉపాధి కార్మికులు ఉన్నారని, వరి కొబ్బరి సరిగి పండక ఇక్కడ కార్మికులకు పనులు లేవన్నారు. ఈ వేతన జీవులు ఉపాధి హామీపైనే ఆధార పడి ఉన్న కారణంగా ఉపాధి హామీ పథకంలో 100 రోజులు పని దినాలు కల్పించాలను కోరుతూ అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. దీనిపై తక్షణం చర్యలు తీసుకుంటామన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో నిందితులకు జరిమానా

ఆలమూరు: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలో ఆలమూరు, మండపేట, మండపేట రూరల్, అంగర పోలీసు స్టేషన్ పరిధిలో నమోదైన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 24 మంది నిందితులకు జరిమానా విధించారు. కోర్టు వర్గాలు ఇచ్చిన సమాచారం మేరకు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒక్కొక్కరికి రూ.10500 జరిమానాను విధించినట్టు తెలిపారు.

300 మందికి కంటి వైద్య శిబిరం

రాజోలు: కడలి గమ్మళ్లపాలెం క్రీస్తు సంఘం ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు వద్ద శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ చొప్పల గుణనాథ్ ప్రారంభించారు. నిడదవోలు శ్రీమతి రాజేశ్వరి రామకృష్ణన్ నేత్ర వైద్యశాల సౌజన్యంతో సుమారు 300 మందికి డాక్టర్ నాగరాజు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు.

విలసలో జిల్లా మలేరియా అధికారి పర్యటన

అయినవిల్లి: విలసలో జిల్లా మలేరియా అధికారి ఎస్.వెంకటేశ్వరరావు శుక్రవారం పర్యటించారు. ఫ్రైడే డ్రైడే కార్యాక్రమంలో తాను గ్రామాల్లో పర్యటించి దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిలువ ఉండ కుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. మురుగుడు గుంటల్లో మురుగునీటి మళ్లించాలన్నారు. ఉపయోగించిన ప్లాస్టిక్ బాటిల్స్, కొబ్బరి బొండాలు, మంచినీటి ట్యాంకులు ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో అయినవిల్లి పీహెచ్‌సీ సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం


ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న సిబ్బంది

రాజోలు: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తాడి శ్రీనివాస మహేశ్వరరావును శుక్రవారం రాజోలు బాలుర ఉన్నత పాఠశాలలో ఘనంగా సత్కరించారు. ప్రధానోపాధ్యాయిని సరస్వతి అధ్యక్షతన అభినందన సభ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ చేతుల మీదుగా శ్రీనివాస మహేశ్వరరావు అవార్డు అందుకున్నారు. గణిత ఉపాధ్యాయుడిగా మహేశ్వరరావు అంకితభావంతో విధులు నిర్వహిస్తున్నారని పలువురు కొనియాడారు.